
పెద్ద కథ:

# కమ్మని కథ

చిత్రకళ హనుమంతరావ్



"ఈ పూట భోజనం హోమ్లీగా ఉందండి!" సన్యాసిరావు గోంగూర పచ్చడి కలుపుతూ అన్నాడు నేను అతడిమాటను కాదనలేదు సమాధానంగా చిరునవ్వు నవ్వేను ఈ లోపున సర్వరు వస్తే-

"ఓ ఉల్లిపాయ తెచ్చిపెట్టు అప్పారావ్ " అంటూ ఆజ్ఞ జారీ చేశాడు ఆ సదరు అప్పారావు ఉల్లిపాయ ముక్కలు తెచ్చి సన్యాసిరావు విస్తట్లో వేశాడు అడక్కుండా నా విస్తట్లోనూ రెండు ముక్కలు వేశాడు "గోంగూర పచ్చడిలో ఉల్లిపాయ లేక పోతే అసలు రుచి రాదండీ."

"అవును"

"ఇవాళ గోంగూర పచ్చడి బ్రహ్మాండంగా చేశాడు అయితే

కూర తగలపెట్టేశాతు జెంతకాయ అసలు ముద్దకూర చెయ్యనే కూడదు. అంతేకాదు, కాయలు ఎంత ముదురివో చూడండి పాతేస్తే మొక్కలు మొలుస్తాయి కూడా"

"హొటలు వాళ్లు కూరలు 'హొల్ సేల్' లో కొంటారు ముదురూ లేతా అంటూ ఏరరు."

"లేత కాయలు ఏరి కొనవచ్చు కద ముద్దకూర చేసేబదులు వేపుడు కూర చెయ్యవచ్చుకద"

"లేత కాయలు ఏరి కొని, వేపుళ్లు చేస్తే హొటలు దివాలా తియ్యాల్సిందే"

"మీరు మరీ చెబుతారండి ఎందుకండీ దివాలా తియ్యడం? మనం ఇస్తున్నది రెండున్నర వాళ్లు పెట్టే భోజనం విలువ రూపాయికి మించి ఉండదు"

అతడితో వాదిస్తూ పోతే అంతు అంటూ ఉండదు సమాధానంగా చిరునవ్వు నవ్వేను.

నేనూ, సన్యాసిరావూ ఒక వూరి వాళ్లం కాదు; కలసి చదువుకోలేదు ఒకే ఆఫీసులో పని చెయ్యడంలేదు మా స్నేహం సుమారుగా రెండు నెలల ప్రాయానిది అతి విచిత్రంగా మేమిద్దరం స్నేహితులమయ్యాం.

సుమారు రెండు నెలల క్రితం ఒక రోజు నేను హొటల్లో భోజనం చేస్తూంటే, ఓ వ్యక్తి నా ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు వింతగా అతడిని గమనించ సాగేను రూపంలో అయితే అతడిలో ఏవిధమైన అంగ వికారమూ లేదు. పైపెచ్చు స్ఫురద్రూపి. అయిదున్నర అడుగుల పొడవూ, పొడుక్కుతగ్గలావూ బాగానే ఉన్నాడు నాకువింతనుగొలిపిందల్లా అతడి చర్యలు. కుర్చీలో కూర్చోగానే చేతిలోవున్న ప్లాస్టిక్ డబ్బా బల్లమీద పెట్టాడు అది చిన్న సైజు పోపుల పెట్టె ప్రమాణంలో ఉంది డబ్బా మూత తీశాడు దానికి అరలున్నాయి ఒక దాన్లో గోంగూర పచ్చడి.మరోదాన్లో ఆవకాయ ఇంకో దాన్లో మాగాయ . కందిపొడి వగైరాలున్నాయి సర్వరు వచ్చి వడ్డించి వెళ్ళి పోయాడు నేను తననే గమనిస్తున్నట్లు గ్రహించాడు కాబోలు,

"ఇవాళ కూరా, పచ్చడి చూడండి నాటితో ఓ ముద్దయినా నోట బెట్టగలమా? అంచేత ఏదో తెచ్చుకుని వేసుకోవాల్సిందే ... ఇవాళ భోజనం ఇలా వుంటుందని నాకు ముందుగానే తెలుసు అందుచేతే ఈ డబ్బా తేవడం" అన్నాడు

"ఇవాళ భోజనం ఇలా వుంటుందని మీకు ముందుగానే తెలుసా?" ఆశ్చర్యాన్ని ప్రకటించాను

అతడు నవ్వి, "స్కూళ్లకి, టైమ్ టేబిల్" అని వుంటుంది హొటళ్లకి " 'మెనూ టేబిల్' వుంటుంది దాన్లో మార్పుండదు కావాలంటే మీరే చూడండి. రేప్పొద్దున్న దొండకాయ కూరా, పొట్లకాయ పప్పు గుమ్మడికాయ సాంబారు," అన్నాడు అతగాడు చెప్పినట్టు భోజనం మింగుడు పడ్డంలేదు అతడు గోంగూర

పచ్చడీ, ఆవకాయా తను వడ్డించు కుని నాకూ వడ్డించాడు మొహమాట పడబోయాను

"మొహమాటం వద్దండి. బ్రహ్మ చారుల కష్టాలు నాకు తెలుసు"

"మీరు చెప్పింది నిజమే నా కింకా పెళ్ళికాలేదు"

"మీరు బ్రహ్మచారి అని సులువుగానే గుర్తించాను ఎలా అంటారేమో మనకి తినాలన్న "ఆబ"వుంటుంది కాని హోటలు భోజనం మింగుడు పడదు అదే పెళ్ళయిన వాడైతే యాంత్రికంగా నాలుగు మెతుకులు తినేసి లేచిపోతాడు"

అతడు చెప్పింది నిజమే మరి అతడు వేసిన గోంగూర పచ్చడి, ఆవకాయలతో సుష్టుగా భోజనం చేశాను అతడి భోజనమయ్యాక క్రిందకు దిగి వచ్చాం. నేను సిగరెట్లు, కిళ్ళీలు తీసుకొని అతనికి 'ఆఫర్' చేశాను కిళ్ళీలు వేసుకున్నాం, సిగరెట్లు ముట్టించుకున్నాం

"నా పేరు సన్యాసిరావు 'స్టేట్ బ్యాంకి, లో పనిచేస్తున్నాను" అంటూ తనను పరిచయంచేసుకున్నాడు.

"నా పేరు ప్రకాశం అగ్రికల్చరల్ యూనివర్సిటీలో స్టేటిస్టీషియన్ని"

"మీ ఇంటి పేరు."

చెప్పాను వాళ్ళయింటి పేరు చెప్పి, "మనం మనం ఒకటి" అన్నాడు అతర్వాత అర్థమయింది మా శాఖలు ఒకటేనని!

అదేమా తొలిపరిచయం ఆ రోజు ఎలాంటిదోకాని, రాను రాను దగ్గర పడ్డాం. సర్వసాధారణంగా బ్రహ్మచారులు ఏదో ఒక హోటల్లో వాడుగ్గా ఒకటో తారీకున టిక్కెట్లు కొనుక్కుంటారు సన్యాసిరావు అలా కాదు! ఈ పూట చేసిన హోటల్లో రెండో పూట భోజనం చెయ్యడు అతడి సిద్ధాంతం ప్రకారం ఏదయినా హోటల్లో భోజనం ఒకపూట బావుంటే రెండో పూట బావుండదు! అదీ నిజమేనేమో? అతడికి అన్ని హోటళ్ల "మెనూ"లు తెలుసు కాబట్టి ఏ హోటల్లో "మెనూ" నచ్చితే అక్కడ చేస్తాడు నేనూ, సన్యాసిరావూ ఉంటున్నది చిక్కడపల్లిలోనే. ఒక హోటల్లో వాడుగ్గా భోజనం చేసే వాడిని సన్యాసిరావుతో పరిచయమయ్యాక హోటల్లో టిక్కెట్లు కొనడం మానేశాను సాయంత్రం అయ్యేసరికల్లా నాగదికి వస్తాడు సాయంత్రాలు సరదాగా తిరిగి తిరిగి, ఏదో హోటల్లో భోజనం చేసి రాత్రి తొమ్మిదిన్నరకు గదులు చేరుకుంటాము

ఇద్దరమూ భోజనాలు ముగించుకుని మెట్లుదిగుతూంటే గోపాలం ఎదురొచ్చాడు.

"ఏరా ప్రకాశం ఈ మధ్య కన్పించడమేమానేశావ్ మా ఇంటికి వచ్చి యెన్నిరోజులు అయింది? నీ గదికి నాలుగైదుసార్లు వచ్చాను గదికి తాళం వేసే వుంటోంది భోజనానికి వెళ్ళవేమోనని ఈ హోటలుకికూడా వచ్చాను కన్పిస్తేనా?...."

"రెండుసార్లు మీయింటికి వచ్చాను. రేణూ చెప్పలేదా?...."

"చెప్పిందనుకో నేను యింట్లో లేక పోతే వెయిట్ చెయ్యొచ్చుగా?" సన్యాసిరావు మాయిద్దరివైపూ మార్చి మార్చి చూసి-

"హెూమ్లీ మీల్స్ తర్వాత మిరాయికిళ్ళీ, సిగరెట్టూ ఉండాల్సిందే...." అంటూ కిళ్ళీ కొట్టు వైపు వెళ్ళాడు

"తీరిగ్గా మాట్లాడు కుందాం కాఫీ తీసుకుందువుగాని పద...." అంటూ గోపాలాన్ని హెూటలులోపలికి లాక్కొనిపోయాను కాఫీ మాట వినగానే గోపాలం కోపం తగ్గింది వాడూ నాలాగే కాఫీ ప్రాణి! కాఫీ త్రాగుతూ-

"అవునూ. ఎవరీ సన్యాసి? అన్నాడు

నేను ఒకింత ఆశ్చర్యపోయి,

"అతడి పేరు నీకెలా తెలుసు"? అన్నాను

"హెూటల్లో భోజనం-హెూమ్లీ మీల్స్ - అన్నవాడు సన్యాసి కాక ఏమవుతాడు? "

"అతడి పేరు సన్యాసిరావు ఇవాళ భోజనం బావుందని, హెూమ్లీ మీల్స్ అన్నాడు భోజనం బావుండడానికి కారణం గోంగూర పచ్చడి "

నేనూ వాడూ నవ్వుకుంటూంటే మూడు కిళ్ళీలూ, మూడు ఫిల్టర్ కింగ్స్ గోల్డు ఫ్లేక్ సిగరెట్లూ పట్టుకుని వచ్చాడు సన్యాసిరావు

"అంతలా నవ్వు కుంటున్నారేమిటండీ....."

"మావాడు కాఫీ చూరు నీళ్ళలా వుందంటున్నాడు ... " అంటూ సర్ది చెప్పాను

"ఆయనకి "ఫిల్టర్" కాఫీ అలవాటు కాబోలు ."

"మీరు చెప్పింది నిజమే "

గోపాలం కాఫీ త్రాగడమయింది బయటకు వచ్చి పేవ్మెంట్ మీదనిలబడ్డాం మా ఇద్దరికీ కిళ్ళీలూ, సిగరెట్లూ ఇచ్చాడు సన్యాసిరావు,

కిళ్ళీలువేసుకుని, సిగరెట్లుముట్టించుకున్నాం కిళ్ళీలో పిప్పరమెంటు ఎక్కువ వేయించాడేమో, ఘాటుగా వుంది!

"ఏం కిళ్ళీ అండీ బాబూ తమలపాకు నమిలినట్లువుందా? గడ్డినమిలినట్లుంది కాని, మీరెన్ని చెప్పండి తమలపాకంటే తుని ఆకండీ! ఆఆకు ఎంతమృదువుగా వుంటుంది! నోట్లో వేసుకుంటే కరిగిపోదూ?" నేను నవ్వేను. గోపాలం అతగాడు చెప్పింది చెవులు రిక్కించుకుని మరీ వింటున్నాడు అతడు గోపాలంవైపు చూసి-

"మీరేం మనుషులండి బాబూ ఇంత వరకూ వారిని పరిచయం చేశారుకాదు" అంటూ నాపై నిష్టూరం వేశాడు

కాస్త నొచ్చుకుని,

"ఏదీ ఇంతవరకూ మీరిద్దరూ నాకు మాట్లాడే అవకాశాన్ని రాని



చ్చారు కాదు

"వాడు గోపాలం నా ప్రాణ స్నేహితుడు . ఒకేవూరువాళ్ళం.. వీధి బడి దగ్గర్నుండి బిఎస్సీ వరకూ కలసి చదువుకున్నాం ... ప్రస్తుతం ఇన్సూరెన్సు కంపెనీలో ఉద్యోగం అశోక్‌నగర్‌లో నివాసం "

"ఈయన సన్యాసిరావుగారు స్టేట్‌బ్యాంకిలో ఉద్యోగం ... తుని స్వగ్రామం " అంటూ ఒకరి నొకరికి పరిచయం చేశాను

"మనం ముగ్గురం "తూగో"ల మన్నమాట "

గోపాలం ప్రశ్నార్థకంగా నావైపు చూశాడు

"తూర్పుగోదావరి జిల్లాల వాళ్ళమని " నేను చెప్పాను గోపాలం నవ్వేడు

"సన్యాసిరావుగారికి తూర్పుగోదావరిజిల్లా వాళ్ళంటే మా చెడ్డ అభిమానం "

"గోపాలంగారు ఇన్సూరెన్సుకి చెందిన వారన్నమాట ..ఆయన దగ్గర జాగ్రత్తగా ఉండాలి" అన్నాడు సన్యాసిరావు

"ఎంచేత?" గోపాలం అడిగాడు.

"ఇన్సూరు చెయ్యమని వేపుకు తింటారు "

"సన్యాసిరావుగారు కలుపుగోలు మనిషి ఆయన మాటల తీరేఅంత. ఏమీ అనుకోబోకురా గోపాలం" నేను సర్దిచెప్పాను గోపాలం జ్ఞానిలా నవ్వేడు

"ఇలాంటివి మాకు మామూలేరా ప్రకాశం! మాటలకే నొచ్చుకుంటే ఎవరిచేతా "ఇన్సూరు" చేయించలేము" అని సన్యాసిరావు వైపుతిరిగి "మీరు ఇన్సూరెన్సు వాళ్ళని మరీ అలా అనడం బావుండలేదండి

మేము ప్రజా సేవకులం' ప్రకృతి కలిగించే విపత్తులకు సంసారాలు చితికి పోకుండా కాపాడతాము" అన్నాడు

సన్యాసిరావు మాట్లాడలేదు

"అంతెందుకు మీ విషయమే తీసుకోండి. ఇప్పుడు మీరు ఆరోగ్యంగా వున్నారు, ఘనంగా ఆర్జిస్తున్నారు ఈ రోజుల్లో మానవ జీవితానికి అంతం ఎప్పుడో చెప్పలేకుండా వున్నాము ఇవాళ రాయిలా వున్నావాడు రేపు "రప్" మంటున్నాడు పోయినవాడి సంగతి వదిలెయ్యండి అతడు పోయాక ఆతడి మీద ఆధారపడ్డ కుటుంబం సంగతి చెప్పండి కీడెంచి మేలెంచమన్నారు రేపు మీ కేదయ్యినా అయిందనుకోండి అప్పుడు మీ భార్యా పిల్లల సంగతేమిటి?"

"గోపాలంగారూ మీరింత చెప్పారు నన్నొ రెండు ముక్కలు చెప్ప నివ్వండి మొదటిది నా ఆయుర్దాయం ఎనభయ్యేళ్ళు. ఆ లోపున యమధర్మరాజు వచ్చినా నన్నేమీ చెయ్యలేడు. రెండోదినాకింకా పెళ్ళి కాలేదు "

"ఆయుర్దాయం వుంటే మంచిదే కానీ కీడెంచి మేలెంచ మన్నారు"

"ఆ భయమేమీలేదు"

"మరీ మంచిది మీరు కట్టిన డబ్బు మీకు వచ్చేస్తుంది కద "బోనస్‌తో సహా రేపటి కోసం ఇవాళ దాస్తున్నామనుకోవచ్చుకద"

"దానికి ఇన్సూరెన్సు ఎందుకు? మా బ్యాంకే వుందిగా చక్కగా ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకోవచ్చు"

"ఇన్సూరెన్సు వాళ్లు కూడా మీరుకట్టిన డబ్బులో కొంత అప్పుగా యిస్తారు"

"దానికి ఎన్ని తతంగాలు గోపాలంగారూ ఏదో బలమైన కారణం ఉండాలి మీరెన్ని చెప్పండి ఇన్సూరెన్సు వాళ్ళ దగ్గరనుండి డబ్బు రాబట్టుకోడం అంత తేలికకాదు"

గోపాలం మరికవాదించలేదు అయితే నిరుత్సాహ పడనూలేదు! "మరోసారి తీరిగ్గా మాట్లాడుకుందాం సన్యాసిరావుగారూ మీకు "ఇన్సూరెన్సు" వాళ్ల మీద చెడ్డ అభిప్రాయం వుంది మీరేమీ అనుకోకపోతే ఓ చిన్నమాట-మీకు "ఇన్సూరెన్సు"గురించి సరిగ్గా తెలీదు మీకు తీరిగ్గా అన్నివిషయాలూ చెబుతాను మరోమాట మేము ఎవరినీ "ఇన్సూరు" చెయ్యమని బలవంత పెట్టము "ఇన్సూరు" చేయడం వల్ల వచ్చే లాభాలు చెప్పి, చేస్తే మీకే లాభదాయకమని చెబుతాము మిమ్మల్ని "ఇన్సూరు" చెయమని అడుగుతున్నాననిమాత్రం అనుకోకండి" సన్యాసిరావు మరేమీ అనలేదు అప్పటికే తొమ్మిదిన్నర అయింది "ఇక వెడదామండీ ప్రకాశంగారూ రేపు రాత్రి మన భోజనం" స్వాగత్‌లో" ఆరింటికల్లా మీ గదికివస్తాను"

"అలాగే"

మా యిద్దరికీ సెలవు చెప్పి సన్యాసిరావువెళ్ళిపోయాడు నేనూ

గోపాలం పేమెంటు మీద మిగిలేం

"ఇప్పుడు చెప్పరా మా యింటికి ఎందుకు రావడంలేదు ? మునుపు రోజూ వచ్చేవాడివి "

కారణమేమీ లేదు సన్యాసి రావుతో పరిచయమైనప్పటి నుండి సాయంత్రాలు కలిసి తిరుగుతున్నాం ఎక్కడో భోజనం చేస్తున్నాం" నేనూ మీతో పాటే తిరిగే వాడినికద సాయంత్రాలు "బోరు" కొట్టి చస్తున్నాను నీగదికి ఎన్నిసార్లు వచ్చేనో ఎప్పుడూ తాళంవేసే ఉంటోంది పోనీ హెూటలు దగ్గర దొరుకుతావేమోనని వస్తే ఇక్కడ దొరకడం లేదు అఖరికి ఇవాళ దొరికావు"

"నేను ఈ హెూటల్లో నెలటిక్కెట్లుకొనలేదు నేను సన్యాసిరావు నచ్చిన హెూటల్లో చేస్తున్నాము ఆ సంగతి వదిలేసి విశేషాలుచెప్పు"

"మా అమ్మకి మళ్ళీ "బి పి. వచ్చింది ఎంచేతని అడగవేం?"

"నువ్వే చెప్పు "

"మా పక్కింటి సీతకు పెళ్ళి నిశ్చయమైంది "

"సీతకి పెళ్లి నిశ్చయమైతే మీ అమ్మకి బి పి రావడమెందుకు?" ఆశ్చర్యపోయాను

"సీతకు కుదిరిందని కాదు రేణూకి కుదరలేదని."

"ఈ మధ్య ఏమైనా సంబంధాలు చూశావా?"

"చూస్తూనేవున్నాను. ఈ మధ్య ఎవరో ఓ సంబంధం చెప్పారు. నేనూ ఆ కుర్రాడిని చూడకుండానే మధ్యవర్తి పెళ్ళి చూపులకు తీసుకొచ్చాడు అతడు మంచి ఉద్యోగంలోనే వున్నాడు రేణూని అడిగితే 'నీ ఇష్టం అన్నయ్యా!' అంది అయితే నాకే నచ్చలేదు "

"ఎంచేత?"

పెళ్ళి కొడుకుని చూడగానే నీరు కారిపోయాననుకో వయసు చూడబోతే ముప్ఫయిఅయిదు రేణూ ఇరవయేళ్ళది అంతేకాదు రేణూ నాజూగ్గావుంటుందా, అతగాడు ఆరడుగులవాడు భారీ విగ్రహం కలవాడు నల్లగా తుమ్మ మొద్దులా ఉన్నాడు ఇవన్నీ చాలనట్లు నిగనిగలాడుతూ బట్టతల పిచ్చిపిల్ల తను నాకు భారమనుకుందో ఏమో "నీయిష్టం" అనేసింది నాకే నచ్చక, పిల్ల ఇష్టపడటం లేదని చెప్పాను అంత గతిలేనివాడినా చెప్పు ఎవరికో ఒకరికి కట్టబెట్టడానికి "

గోపాలం చెప్పింది నిజమే రేణుకకి ఏం తక్కువ? సన్నగా, పొడుగ్గా చెంపకి చారడేసి కళ్ళతో కళ కళ్లాడుతూ వుంటుంది అయినా ముప్ఫయ్ అయిదేళ్ళవాడు ముప్ఫయ్యేళ్ళ దాన్ని చేసుకోవాలి గాని ఇరవయ్యేళ్ళ రేణుకని "తగుదునమ్మా" అంటూ చూడ్డానికి వస్తాడా?

"అన్నట్లు రేణూ పరీక్ష ఏమయింది ?

"ఫస్టు క్లాసు వచ్చింది "

"మరి శంకరం ? "

"మళ్ళీ ఫెయిలయ్యాడు." వాడు

ఇంటర్మీడియేటు ఎప్పటికి పాసవుతాడో అసలు వాడికి చదువు మీద శ్రద్ధ వుంటేగా ?, ఈ సారైనా ఓ ట్యూటరుని పెటాలి అవును నన్ను ఇన్ని ప్రశ్నలడిగావు. హేమ పరీక్ష ఏమయింది. ?

"ఫస్టు క్లాసు వచ్చింది"

"మీ మామయ్య ఉత్తరం వ్రాశాడా? పెళ్ళెప్పుడుచేస్తానంటున్నాడు?

"పాపం మామయ్య తప్పేముంది రా? రెండేళ్ళ క్రితమే చేస్తానన్నాడు కద నేనే బి ఏ చదివించమన్నాను"

"ఒరేయ్ ప్రకాశం, ఇం కెంత కాలంరా నీకీ హెూటలు మెతుకులు? హేమ చదివినచదువుచాలు."ఏమ్మే" చదివించమనకు హేమ పట్టుబడితే తప్ప"

"అలాటిదేం లేదు బి.ఏ కూడా తాను చదువుతాను అనలేదు. నా మాట కాదనలేక చదివింది."

హేమ కళ్ళ ముందు మెదిలింది సృష్టిలో వున్న అందమూ మంచితనమూ తనలోనే వున్నాయనిపిస్తుంది. నేనుపుట్టినఅయిదేళ్లకు హేమ పుట్టింది తనుపుట్టగానే ప్రకాశంగాడికి పెళ్ళాం పుట్టిందంటూ తెగమురిసిపోయిందట అమ్మమ్మ! అప్పటి నుండి హేమనాకు కాబోయేపెళ్ళాంగా నేచెలామణి అయింది మధ్యాహ్నాం తనదగ్గరనుండి వచ్చిన ఉత్తరాన్ని మననం చేసుకున్నాను తను ఫస్టు క్లాసులో పాసయినట్లు వ్రాస్తూ, "నువ్వు "బిఏ" చదవమన్నప్పుడు కాదనలేక పోయాను బావా, నీమాట కాదనలేక నీమీద ప్రేమకొద్దీ దయచేసి "ఎమ్మే" మాత్రం చదవమనకు ఎంతకాలం మనమిలా దూరదూరంగావుంటూ ప్రేమలేఖలు వ్రాసుకోవడం? రానురాను నీదగ్గరకురావాలన్నతహతహఎక్కువైపోతోంది యెంచేతంటా వేమో నీ మీద ప్రేమ కొద్దీ, అంతేకాదు కొంత భయంవల్ల కూడా ఈమధ్య కొన్ని వార్తలు వస్తున్నాయి ఉద్యోగమంటూ హైదరాబాదు చేరిన యువకులు పదిరోజుల్లో ప్రేమలోపడిపెళ్లాడేస్తున్నార్ట అలాంటి వార్తలు విన్నప్పుడు నువ్వుకూడా అలా చేస్తావేమో నన్ను గోదావర్లో ముంచేస్తావేమోనని భయం వేస్తుంది. నువ్వు అలాచేస్తే నాగతి ఏంకాను? నువ్వు అలా చెయ్యవని నా మనసుకు తెలుసనుకో, ఆడభయం అంటే ఇదే కాబోలు నాన్న ఈ మధ్య పురోహితుడ్ని పిలిపించి, ముహూర్తాలు ఎప్పుడున్నాయో చూడమన్నారు అగస్టు నెలలో ఉన్నాయట. నాన్న దగ్గర్నుండి ఉత్తరం వస్తుంది దయచేసి మన పెళ్లి వాయిదా వెయ్యమనకు అంతగా ఎమ్మే చదవమంటే ప్రయివేటుగా కట్టి పాసవుతాను అంటూ వ్రాసింది చదవమని ఇక హేమను బాధ పెట్టదల్చుకోలేదు మామయ్య ఉత్తరం అందగానే అంగీకారాన్ని తెలుపడానికే నిశ్చయించుకున్నాను

"ఏమిత్రా అంతగా ఆలోచిస్తు



న్నావ్ హేమ కాని గుర్తు కొచ్చిందా ఏమిటి? "

నేను నవ్వేను

. 'అసలు సంగతి మర్చిపోయాను అమ్మకి 'బి పి' వచ్చిందని చెప్పాను కద మందులు కొనాలి .. ఓ యాభై రూపాయలు కావాలి..."

"దానికేంరా .. పద నా గదికి ... నేనూ వస్తాను . మీ అమ్మగారినీ, రేణూనిచూసి చాలారోజులయింది "

నా గదికివెళ్ళి డబ్బు తీసుకుని, మందులు కొని గోపాలం యింటికి వెళ్ళాము. రేణుక నన్నుచూస్తూనే

"ఏమిటిప్రకాశంఅన్నయ్యా . .ఈ మధ్య రావడమేమానేశావ్ "అంది

"వాడికి కొత్త స్నేహితుడు దొరి కాడే రేణూ ...వీడికి తీరికే చిక్కడం లేదు.. "

"అదేం లేదు రేణు.... ఆ మధ్య ఒకటి రెండుసార్లు వచ్చానుకద "

"హేమ ఉత్తరం వ్రాసిందా? తనకి క్లాసు వచ్చిందా? అది ఈ మధ్యనన్నుపూర్తిగామరచిపోయింది ఆ మధ్య ఉత్తరం వ్రాసినా జవాబు వ్రాసిందికాదు ఎప్పటికైనా ఈ వూరు రావాల్సిందే కద రానియ్యి చెబుతాను "

"హేమ ఈవూరువస్తుంది నిజమే నీకు పెళ్ళయి ఏవూరు వెడతావో ఎవరికెరుక?"

పెళ్ళనగానే రేణుక చెక్కిళ్ళు కెంపులయినాయి

"నువ్వెప్పుడూ ఇంతే" అంటూ లోపలకు వెళ్ళింది

నేను పార్వతమ్మగారి గదిలోకి వెళ్ళాను

"ఏమయ్యా.... ఈ మధ్య రావడమే మానేశావ్"

"ఏరోజు కారోజు వద్దామనుకుం టూనే వున్నాను ... మీ ఆరోగ్యం

ఎలావుంది?"

చూస్తూనే ఉన్నావుకద ఆరోగ్యం పోయే వయసే కాని వచ్చే వయసుకాదు .. ముందు దాని పెళ్లి అవ్వాలి ఈ మధ్య ఓ సంబంధం చూశాము అదేమీ కాదనలేదుకాని వాడికి నచ్చలేదు. చెప్పకపోవడమేం. వయసు ఎక్కువ.. అదీ కాక కాకి ముక్కుకి దొండపండు లా ఉంటాడనిపించింది

"రేణూ పెళ్లిని గురించి దిగులు పడకండి . మంచి సంబంధం వస్తుంది "

" అంతా భగవంతుడి దయ "

గోపాలం రేణుకలతో చెప్పి గడికి బయలుదేరుతూ,

"రేపు సాయంత్రం వస్తావుకదురా గోపాలం సన్యాసిరావు కూడా వస్తాడు సరదాగా తిరుగుదాం" అన్నాను

"అలాగే "అన్నాడు గోపాలం

* * *

నేనూ, గోపాలం రాజమండ్రి వాస్తవ్యులం గోపాలం వాళ్ళు మా వెనుకవీధిలో వుండేవారు మా మయ్యవాళ్ళదీ మా యింటి ప్రక్క ఇల్లే

రేణుకా, హేమా, సమ వయస్కులు. వాళ్ళు ఇంటర్మీడియేట్ వరకూ క్లాసుమేట్సు వాళ్ళు ఎంత ప్రాణ స్నేహితు రాళ్లంటే - వాళ్ళ మధ్య దాపరికా లుండవు.

గోపాలం తండ్రి రాజకీయవాది స్వాతంత్ర్య సమరంలో పాల్గొని నాలుగైదు సార్లు జైలుకి వెళ్ళారు అంతేకాదు - పాతికెకరాల మాగాణి అయిదెకరాలకి తెచ్చారాయన గోపాలం బి ఎస్సీ పాసయిన కొద్దినెలలకే గోపాలం తండ్రి చనిపోయాడు ఇంట్లో జరుగుబాటుకి వున్న అయిదెకరాలూ అమ్మాల్సి వచ్చింది

'బి ఎస్సీ పాసవగానే ఎమ్మెస్సీ చదువుకి విశాఖపట్నం వెళ్లిపోయాను. గోపాలం చదువు మానేశాడు వాడి దినచర్యల్లా దినపత్రికలు చూసి ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టడం. ఏడాదిపాటు విసుగుచెందని విక్రమార్కుడిలా ప్రయత్నించి, ఆఖరికి 'ఇన్సూరెన్సువాళ్ళు పెట్టిన పరీక్షలో నెగ్గి ఉద్యోగస్థుడైనాడు తల్లినీ, చెల్లెల్నీ తీసుకుని హైదరాబాదువచ్చేశాడు నేను 'ఎమ్మెస్సీ' పాసయి, హైదరాబాదు వచ్చి ఉద్యోగంలో చేరాను మళ్ళీ నేనూ, గోపాలం కలుసుకున్నాము

రేణుక అందంలో అపరంజి కాకపోవచ్చు సన్నగా, పొడుగ్గా, తీర్చి దిద్దిన అవయవ సౌష్ఠవంతో, తీర్చి దిద్దిన కనుముక్కు తీరుతో కళ్లకింపుగా ఉంటుంది రూపానికి తగినట్లు ఆమెదిమెత్తనిమనసు, అన్నగారంటే తగని ప్రేమ, అతడికి ఏం కావాల్సొచ్చినా ఆమె చేసి పెట్టాల్సిందే! వాడి పనల్లా జీతం రాగానే ఆమె చేతుల్లో పెట్టడం. చేస్తున్నది "ఇన్సూరెన్సు" కంపెనీలో ఉద్యోగం. అందుకు తోడు గోపాలం తిరిగే మనిషి వాడు ఎన్ని గంటలకు ఇల్లు చేరినా, తను భోజనం

చెయ్యకుండా వాడి కోసం ఎదురు చూస్తుంది రేణుక! అన్నగారు కష్ట పడి పోతున్నాడని విల విల్లాడి పోతుందిరేణుక ఈమధ్య గోపాలం తల్లి- పార్వతమ్మ గారికి "బ్లడ్ ప్రెషరు" వచ్చింది ఎవరికో పెళ్లి కుదిరిందని తెలిస్తే చాలు రేణుకకి కుదరలేదని బెంగపడి పోతుంది "బ్లడ్ ప్రెషరు" ఎక్కువయి పోతుంది!

* * *

అ మరునాడు సాయంత్రం—

గోపాలం నాగదికి వచ్చాడు వాళ్ళమ్మగారికి కాస్త నయమట, నేనూ, వాడూ ఆ మాటా ఈమాటా మాట్లాడుకుంటూ గడిపాము ఇంతలో సన్యాసిరావు వచ్చాడు

"గోపాలం గారు కూడా వచ్చారే" అంటూ

"అవును ఇవాల్టి నుండి గోపాలం కూడా మనతో తిరుగుతాడు"

"చాలాసంతోషం... మరి ఆయన భోజనం?.."

"నాకు తొమ్మిదిన్నరలోపు భోజనం చేసే అలవాటు లేదు..." అన్నాడు గోపాలం

"మన ప్రోగ్రామేమిటి?" అన్నాను.

"సరదాగా కాలాపహాడ్‌కి వెళ్లి దేముడ్ని చూద్దాం... అక్కడినుండి పబ్లిక్ గార్డెన్సుకి వెళ్లి కూర్చుందాం ఆ తర్వాత "స్వాగత్"లో భోజనం"

ముగ్గురమూ, కబుర్లు చెప్పుకుంటూ కాలాపహాడ్‌కి వెళ్ళాం ఆ తర్వాత పబ్లిక్ గార్డెన్సుకి పోయికూర్చున్నాం ఎనిమిదన్నర య్యేక "స్వాగత్"కి వెళ్ళి భోజన మయ్యాక బస్సులో చిక్కడపల్లి చేరుకున్నాం సన్యాసిరావు తన గదికి వెళ్ళి పోయాడు. నేను వెళ్ల బోతూంటే "మా యింటికిరారా." అన్నాడు గోపాలం

కాదనలేక వాడిని అనుసరించాను

రేణుకా, గోపాలం భోజనాలు చేస్తూంటే నేను పార్వతమ్మ గారితో మాట్లాడుతూ కూర్చున్నాను

"ఏమయ్యా ప్రకాశం. పప్పన్నం ఎప్పుడు తినిపిస్తావయ్యా చక్కగా ఆర్జిస్తున్నావ్ వెతక్కుండానే చక్కటి పెళ్ళి కూతురు హేమ వుంది మరింక ఆలశ్య మెందుకయ్యా.." అంది పార్వతమ్మగారు

"వచ్చే నెలలో అనుకుంటు న్నారు"

"చాలా సంతోషం.. నీ యెరికలో ఏదయినా మంచి సంబంధం వుంటే చెప్పబాబూ ఆస్థిపాస్తులు లేక పోయినా ఫర్వాలేదు.... నాలుగురాళ్లు తెచ్చుకునే వాడూ, బుద్ధిమంతుడూ అయితే చాలు"

"తప్పకుండా చెబుతానండి..."

గోపాలం భోజనం చేసి చేతులు తుడుచుకుంటూ వచ్చాడు "పదరా కాసేపుడాబా మీద కూర్చుందాం" అంటూ

నేనూ గోపాలం డాబా మీదకు

వెళ్ళిలో కాభిరామాయణంలో పడ్డాము ఏదో గుర్తుకి వచ్చిన వాడిలా

"అవునూ. ఈ సన్యాసిరావుని గురించి నీకు తెలిసిందంతా చెప్పు" అన్నాడు

వాడు అలా అడగ్గానే నా మనసులో ఓ ఆలోచన మెదిలింది అలా జరిగితే బాగానే వుంటుంది కాని, సన్యాసిరావు కొండమీద కూర్చున్న వాడు!

"జగన్నాథంగారి సంతాన మల్లా ఇద్దరాడ పిల్లలూ, ఒక కొడుకు సన్యాసిరావు జగన్నాథంగారికి తునిలో చెప్పుకోదగ్గ ఆస్థివుంది. కొబ్బరి తోటలూ, తమలపాకు తోటలూ, మాగాణీ పొలమూ వున్నాయి. కూతుళ్లిద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి

ఇక సన్యాసిరావు విషయం బి ఏ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. బ్యాంకిలో ఉద్యోగం "సి ఏ ఐ ఐ బి" పాసయ్యాడు. నేడోరేపో ఆఫీసరవుతాడు కొడుకు పెళ్లి చేసేద్దామని జగన్నాథంగారు గత రెండు మూడేళ్ళుగా ప్రయత్నిస్తున్నారట అయితే సన్యాసిరావుకి నచ్చిన పిల్ల యింత వరకూ తారసపడలేదు "

"అతగాడికి, అప్సరస కావాలా?"

"పొడుగ్గా వుంటే గెడలా వుందంటాడు. పొట్టిగా వుంటే పీపాలా వుందంటాడు. సన్నగా వుంటే క్షామానికి ప్రతినిధి అంటాడు లావుగా వుంటే రోడ్డు రోలర్ అంటాడు ముఖం చిన్నదయితే "పిట్టబుర్ర" అంటాడు పోనీ విశాలంగా వుంటే "తాంబూలపళ్ళెం. మరి తెలుపయితే తెస్పోడుతూ వుందంటాడు అంతేకాదు ఆడపిల్లన్నాక వంటలో ప్రావీణ్యత వుండాలంటాడు ఇంకా అతడికి పై అంతస్థు అమ్మాయిల పై ఓ అభిప్రాయంవుంది వాళ్ళు ఇంటిపనులు చెయ్యర్ట ఇక్కడకాలు అక్కడ పెట్టరట అతనికి పాతికవేలవరకూ కట్నమిస్తామంటూ వచ్చారు "

"అతడి తల్లి తండ్రులు.. "

"క్రితంసారి తండ్రి వచ్చినప్పుడు నా గదికి తీసుకొచ్చాడు ఆయన బెంగల్లా వీడి పెళ్ళిగురించే. మాటల సందర్భంలో అన్నాడాయన 'వాడు ఏ పిల్లని చేసుకున్నా అభ్యంతరం లేదు మనవాళ్ళపిల్ల, కాస్త మంచి సాంప్రదాయంనుండి వచ్చినదయితే చాలు అంద చందాలంటావా వాడు చూసుకోవల్సినవి మాకున్నముగనలు సల్లా వాడే కద. వాడిసుఖం కంటే మాకింకేం కావాలి?' అంటూ "

"సన్యాసిరావు ఎలాంటి వాడు?"


"సన్యాసిరావు చాలా మంచి వాడనే చెప్పచ్చు కిళ్లీ అప్పుడప్పుడో సిగరెట్టూ తప్పిస్తే దుర్గుణాలు లేవనే చెప్పచ్చు. అయితే ఓ బలహీనత వుంది."

"ఏమిటది?"

"భోజనం "

"తిండిపోతా?"

"కాదు కాదు సన్యాసిరావు తిండిపోతుకాదు అతడికి రుచికరమైన భోజన ముండాలి అందువల్లనే ఈ



పూట చేసిన హెూటల్లో రెండోపూట చెయ్యడు అతడికి హెూటళ్ళ మెనూలన్నీ తెలుసు వాటినిబట్టి స్వరాజ్ తాజ్ ద్వారకా లేదా స్వాగత్ ఈ జంటనగరాల్లో అత గాడు అడుగు పెట్టని హెూటలు లేదంటే అతిశయోక్తి కాదేమో! ఓ సుగుణం భోజనం ఎంతయినా బావుండనీ తినేదేదో సున్నితంగానే తింటాడు బావుంది కదాని పొట్ట నిండా పట్టించే రకంకాదు"

"అయితే మంచి పెళ్ళి కొడు కందూ"

"నెమ్మదిగా అంటావేమిటి? బ్రహ్మాండమైన పెళ్ళికొడుకు బ్యాం కిలో ఉద్యోగం ప్రస్తుతం గుమాస్తా అయినా కొద్దినెలల్లో ఆఫీసరు కాబోతున్నవాడు పైగా తల్లి తండ్రు లకు ఒకడే కొడుకు. **అస్థంతా అత** డిదే కద"

"చూడు ప్రకాశం! ఇవాళ వారం, టైమూ తారీకూ నెలా చెప్పు.."

"జూలై నెల ఇరవయ్యో తారీకు బుధవారం రాత్రి పదిన్నర..."

"అవునా. ఈ గోపాలం ఓ శపథం జేస్తున్నాడు...."

"ఏమిటది? "

"సన్యాసిరావు చేత రేణూ మెడలో మూడు ముళ్ళూ వేయి స్తాను.. లేదా అతడి చేత ఇరవై వేలకి 'ఇన్స్యూర్' చేయిస్తాను ."

"చూడమ్మా గోపాలం. .సన్యాసి రావు చేత "ఇన్స్యూర్" చేయించడం నీవల్లకాదు బ్రహ్మరుద్రాదులు నీకు సాయపడినా జరిగే పని కాదు . ఇక రేణుక మెడలో మూడు ముళ్లూ

వేయించడమంటావా....తప్పకుండా ప్రయత్నించు... నువ్వు విజయాన్ని సాధించగలిగితే రేణుకంత అదృష్ట వంతురాలు మరొకర్తి ఉండదు "

"నీ సహకారం కావాలిరా!"

"తప్పకుండా. రేణూ నా చెల్లెలు లాంటిది."

* * *

వారం పదిరోజులు గడచి పోయి నాయి సాయంత్రాలు నేనూ, గోపాలం సన్యాసిరావూ కలుసుకుం టూనే వున్నాము గోపాలం తను నవ్వుతూ, ఎదుటివాడిని నవ్వించే రకం రోజులు గడచిన కొద్దీ గోపా లం, సన్యాసిరావులు మరింత దగ్గ రయ్యారు.

ఆ రోజు శనివారం సాయంత్రం మాతో అన్నాడు గోపాలం

"రేపు నాపుట్టిన రోజు మీరిద్దరూ మాయింటికి భోజనానికిరావాలి. "

సన్యాసిరావు కాస్త మొహమాటం పడి,

"మరోసారి వస్తాం గోపాలం గారూ ." అన్నాడు

"అదేం కుదరదు....మన పరిచ యం కొద్దిరోజులదైనా స్నేహితుల మయ్యాం. ఇక ప్రకాశం చిన్నప్పటి నుండే స్నేహితుడు. మీయిద్దర్నీ పిలుస్తా ప్రకాశం వస్తాడు మీరూ రావాల్సిందే "

నేను కలుగ జేసుకుని,

"సరే గోపాలం... సన్యాసిరావు గారూ, నేనూ వస్తాం అయితేఓ షరతు నీయింటికి "స్వీట్లు" తిన డానికైతేరాము. మాకు రుచికరమైన భోజనం కావాలి "హెూమ్లీమీల్స్" చేసి చాలా కాలమైంది " అన్నాను

"మీకు ఏం కావాలో చెప్పండి చేయిస్తాను ."

"నా తరపున మజ్జిగ పులుసు, చామదుంపల వేపుడు. సన్యాసిరావు గారు సిగ్గు పడుతున్నారు కాబట్టి ఆయనతరపునా నేనే చెబుతున్నాను బంగాళా దుంపల వేపుడు, కొబ్బరి కాయ పచ్చడి వీలుంటే పులిహెూర "

"ఓస్ ఈపాటిదానికేనా నువ్వు చెప్పిన వాటికి నా తరపున గోంగూర పచ్చడి ఆవడలు కలుపుతున్నాను ఇద్దరూ పొద్దున్న పదిన్నర కల్లా వచ్చెయ్యండి"

సన్యాసిరావు గుటకలు వెయ్య డం గమనించాను!

* *

ఆ మరునాడు—

ఉదయం తొమ్మిదిన్నర కల్లా వచ్చాడుసన్యాసిరావు. అతడు వచ్చే సరికి నా స్నానం వగైరాలు కాలేదు తీరిగ్గా పేపరు చూస్తున్నాను.

"ఇంకా కూర్చున్నారేమిటండీ. తొమ్మిదిన్నర కావస్తూంటేనూ మన కోసం పాపం గోపాలంగారు ఎదురు చూస్తూ ఉంటారు "

"ఎంత పావుగంటలో తయారు కానూ ... ఇంతలో మీరు పేపరు చూస్తూ వుండండి" అంటూలేచాను

పదిన్నరకి ఓ అయిదు నిము షాలు ముందుగానే గోపాలం ఇల్లు చేరుకున్నాము మమ్మల్ని చూసి

గోపాలం ఆశ్చర్యపోయాడు.

"ఒరేయ్ ప్రకాశం నువ్వు ఎన్నడైనా టైముకి రావడమంటూ ఉందిరా? అలాంటిది ఇవాళ..."

"నిజమేరా గోపాలం సన్యాసిరావుగారు వచ్చి గుర్తు చెయ్యకపోతే ఎన్ని గంటలకు వచ్చేవాడ్నో"

సన్యాసిరావు నవ్వు ముఖంతో-

"నేను వెళ్ళేసరికి గోపాలంగారూ ఆయన తీరిగ్గా పేపరు చూస్తున్నారు. స్నానం వగైరాలు కానేలేదు, ఏ మాట కామాటే చెప్పాలి పావుగంటలో తయారయ్యారు" అన్నాడు

"మీరు చెప్పకుండానే ఆ విషయం నేను గ్రహించగలిగాను వీడి బద్ధకం నాకు తెలీదూ?...."

గోపాలం తిరిగి అన్నాడు

"వంటయితే సిద్ధమయింది కాని మరీ పదిన్నర కల్లా ఏం భోజనం చేస్తాం? ఇప్పుడు ఓ అరకప్పు కాఫీ త్రాగి, పన్నెండింటికి కాస్త ఆకలయ్యాక భోజనం చేద్దాం అంత వరకూ రమ్మీ ఆడదాం మీరేమంటారు ?

"అవును, గోపాలం చెప్పింది నిజమే సన్యాసిరావుగారూ పదిన్నరకే భోజనమేమిటి? పన్నెండింటికి చేద్దాం అంత వరకూ రమ్మీ ఆడదాం"

"నేను పేకాట ఆడనండి"

"ఏదో సరదాకోసం స్టేక్ లేకుండా మీరు కాదనకండి"

గోపాలం రేణుకను పిలిచాడు కొద్ది క్షణాల తర్వాత రేణుక గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడింది

"రేణూ. కాఫీ డికాక్షన్‌వుందా,?" అన్నాడు గోపాలం

"ఉందన్నయ్యా"

"మాకు ముగ్గురికి కాఫీకావాలి.... భోజనం పన్నెండింటికి చేస్తాం"

"అలాగే" రేణుక లోపలికివెళ్ళి, పది నిముషాల్లో కాఫీ తెచ్చి మాకు ముగ్గురికి ఇచ్చింది

"రేణుక. బి. ఏ ఫస్టుక్లాసులో పాసయింది గోపాలం చెల్లెలు నాక్కూడా చెల్లెలే"

"ఈయన సన్యాసిరావుగారు మా స్నేహితుడు స్టేట్‌బ్యాంకిలో ఉద్యోగం" అంటూ రేణుకా సన్యాసిరావులను ఒకరి కొకరికి పరిచయం చేశాను రేణుక చేతులు జోడించి "నమస్కారం" అన్నది సన్యాసిరావు రెప్ప వెయ్యడం మరచి కొద్ది క్షణాలు రేణుకను చూస్తూ ఉండిపోయాడు

రేణుక ఒత్తయిన తలకట్టు దువ్వి, రిబ్బనుతో వెనుక ముడి వేసింది తలంటు పోసుకున్నది కాబోలు ముంగురులు నుదుటిపై పడి అల్లల్లాడుతున్నాయి మెడలో ఒంటిపేట గొలుసూ, చేతులకు రెండేసి బంగారు గాజులూ వేసుకుంది నుదుట తిలకం దిద్దుకుంది బాంబే డయింగ్ ప్రింటెడ్ చీర కాబోలు కట్టుకుంది, దానిమీద లతలూ, పువ్వులూ ఉన్నాయి ఇంతలో పార్వతమ్మగారు మేము కూర్చున్న వరండాలోకి వచ్చారు

"మీ ఆరోగ్యం ఎలా వుంది?" అన్నాను.

"కాస్త నయం బాబూ ఇవాళ గోపాలం పుట్టినరోజు నా చేత్తో వండి పెట్టలేకపోయాను పాపం రేణూయే తంటాలు పడుతోంది "

"అమ్మా నేను సన్యాసిరావు గారని చెబుతూ వుంటానే ఈయనే మనవాళ్ళ స్వగ్రామం తుని బ్యాంకిలో పని చేస్తున్నారు " అంటూ సన్యాసిరావుని తల్లికి పరిచయం చేశాడు గోపాలం.

సన్యాసిరావు ఆవిడకు నమస్కరించాడు. ఆవిడ తునిలో వున్న తన పుట్టింటి వైపు బంధువుల గురిం అడిగింది సన్యాసిరావు వినయంగా చెప్పాడు

"వస్తాను బాబూ! కూర్చోలేను . నుంచోలేను... వంట్లో బావుండలేదు కద . వెళ్ళి పడుకుంటాను" అంటూ లోపలికి వెళ్ళిందావిడ

ఈలోపున రేణుక మేడ మీద గదిలో పేకలూ, కూర్చోడానికి చాపలూ సిద్ధం చేసింది మేము మేడమీదకు వెళ్ళి, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ సిగరెట్లు కాలుస్తూ పేకాటలో పడ్డాం

సుమారు పన్నెండింటికి రేణుక వచ్చి భోజనాలకు లేవచ్చు నని చెప్పింది పేకాట ఆపి క్రిందకు వెళ్ళాం కాళ్లూ చేతులూ కడుక్కుని భోజనాల గదిలోకి వెళ్ళి 'డైనింగ్ టేబిల్' దగ్గరకుర్చీల్లో చతికిలబడ్డాం రేణుక వడ్డించింది పులిహోర, ఆవడలూ, రెండు వేపుడు కూరలూ కొబ్బరికాయ పచ్చడీ గోంగూర పచ్చడీ, వేరు వేరు ప్లేట్లలో కంచం చుట్టూ పెట్టింది

"ఇవాళ వంటంతా రేణూ చేసింది నీ పుట్టిన రోజున వంటంతా నేనే చెయ్యాలంటూ. లోటుపాట్లు వుంటే మొహమాట పడకుండా చెప్పండి సన్యాసిరావుగారూ... "

"పాపం ఆవిడకు చాలా శ్రమ నిచ్చారు .. "అన్నాడు సన్యాసిరావు


"ఇవాళ రేణూని చాలా కష్ట పెట్టేశాం.. " అన్నాను.

"భలేవాడివే ప్రకాశం అన్నయ్యా ఈ పాటిదానికి శ్రమేమిటి?...."

కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చెయ్య సాగేము రేణుక మాప్రక్కనే నిలబడి కొసరి కొసరి వడ్డిస్తోంది

"వంటన్నది ఒక కళ...హస్త వాసి ఉండాలి....ఒక్కొక్కరు చేస్తే బ్రహ్మాండంగాకుదుర్తాయి "అన్నాడు గోపాలం.

"మీరు చెప్పింది అక్షరాలా నిజం గోపాలంగారూ. ..మా బామ్మ వంట బ్రంహ్మాండంగా చేసేది ఆవిడ చేసినట్లు మా అమ్మా చెయ్యలేదు, మా మేనత్తలూ చెయ్యలేరు బామ్మ చేసినవి మళ్లీ మళ్లీ తినాలన్పించేవి పనసకాయకూర, అరటి దూటకూర చేసిందంటే వాటి రుచి చెప్పనలవి కాదు అన్నమంతా వాటితోనేతినేయాలన్పించేది....అంతెందుకు? ఆవిడ చారు పెట్టినా, పోపు వేస్తూంటే సందు కొసకు ఘుమఘుమ లాడేది.




బంధువులెవరైనా వస్తేకడుపారాత్రిని ఆవిడకు మరీమరీ చెప్పి వెళ్ళేవారు, వంట చెయ్యడం ఒక ఎత్తయితే,వడ్డించడం మరో ఎత్తు.... దగ్గరే కూర్చుని, "మరికాస్త కూర కలుపుకో" "మరికాస్త పచ్చడి కలుపుకో" అంటూ కొసరి కొసరి తినిపించేది భోజనం సరిగ్గా చెయ్యకపోతే ఆవిడకు తృప్తి ఉండేదికాదు. "వంట బావుండలేదు కాబోలు "అంటూనొచ్చుకునేది ఆవిడ చదువుకోలేదు, పెళ్ళికి ముందు ఎన్నడూ వంట చేసి యెరుగదట ఆవిడకు ఎవరు నేర్పారు? తల్లి వంట చేస్తూంటే గమనించేదట మీరు చెప్పింది నిజం... హస్త వాసి ఉండాలి "

"మీరు చెప్పింది నిజమే మా అమ్మకి వంట్లో బాపుండక, రేణూ ఏదో సరదా కొద్దీ చేసింది "

"మీరు ఆవిడ చేశారని చెప్పగానే .నిజం చెప్పద్దూ. . నేనేం అనుకున్నానో కాలేజీలో చదివిన అమ్మాయి వంట ఏం చెయ్యగలదనుకున్నాను. ఆవిడకు చదువులోనేకాదండీ ఫస్టు క్లాసు.... వంటలో కూడా ఫస్టు క్లాసే ఇంతకాలమూ కా లే జీ లో చ ది వి న అమ్మాయిలు వంటచెయ్యలేరనుకునేవాడ్ని. అలాంటిది ఇవాళ నా ఊహని రేణుక గారు వమ్ము చేసి పారేశారు ."

రేణుక సిగ్గుతో ముఖం దించుకుని, సన్యాసిరావుని ప్రక్క చూపు చూసింది!

ఏది బావుంది? ఏది బావుండలేదు. మొహమాట పడకుండా చెప్పండి " అన్నాడు గోపాలం

"బావుండక పోవడమంటూ లేదు .. అన్నీ చాలా బాగున్నాయి. కూరలు సరిగ్గా వేగాయి, ఉప్పూ కారమూ సరిగా పడ్డాయి, ..కొబ్బరికాయ పచ్చడిబాగా కుదిరింది గోంగూర పచ్చడిలో వెల్లుల్లి వెయ్య

త రుచివచ్చింది....
ులో ఆనపకాయముక్క
ం వల్ల రుచి, కొత్తిమీర
వెయ్యడం వల్ల ఘుమ ఘుమ వచ్చాయి...
ఆవడలు మెత్తగా దూదిలా నోట్లో వేసుకుంటే కరిగి పోయేలా వున్నాయి . ఇక పులిహోరలో పులుపూ కారమూ సరిపోయాయి నూపప్పు వెయ్యడం వల్ల కొత్తరుచి వచ్చింది...
మొత్తానికి చేసినవన్నీ చాలా బావున్నాయి ఇలాంటి భోజనం చేసి ఎంత కాలమయిందో... "

రేణుక మరో రెండేసి ఆవడలూ, పులిహోరా వడ్డించింది

"అయ్యబాబోయ్ మీరలా వడ్డిం చేస్తూంటే తిన లేనండోయ్ ఇప్పటికే పొట్ట ఉబ్బిపోయింది "

రేణుక నవ్వింది

"మరేం ఫర్వాలేదు . ఇంట్లో చేసినవే కద జబ్బు చెయ్యవు పైగా ఇవాళ ఆదివారం కూడానూ " అన్నాడు గోపాలం.

పెరుగు అన్నంలోకి వచ్చాము.

"ఒక్క అడుగు కూడా వేసేస్థితిలో లేనండీ... భోజనం బావుంది కదా అని రెండు ముద్దలు ఎక్కువే తిన్నాను..." అన్నాడు సన్యాసిరావు

నా పరిస్థితీ అలాగే వుంది

"మిమ్మల్నిప్పుడెవరు వెళ్లమన్నారు . అయినా మీరిప్పుడు వెళ్లి చేసే పనేముంది? మేడ మీద గదిలోకి ఎవరూ రారు ..కాసేపు విశ్రాంతి తీసుకుందాం " అని రేణుక వైపు తిరిగి,

"రేణూ . మేడ మీద గదిలో ఒకటే చాప వుంది మరో రెండు చాపలూ, మూడు తలగడలు వెయ్యి ఆకులూ, వక్కపొడీ పెట్టు " అన్నాడు గోపాలం రేణుక వెళ్లింది

మా భోజనాలయ్యాయి చేతులు కడుక్కుని మేడ మీదకు దారితీశాం. కబుర్లు చెప్పుకుంటూ ఆకులూ,వక్కపొడీ వేసుకుని, సిగరెట్లు ముట్టించుకున్నాము ఆ తర్వాత పేకాట మొదలు పెట్టాము ఒ అరగంట ఆడే సరికి నిద్ర ముంచుకొచ్చింది చాపలమీద వాలిపోయాము నిద్రలు లేచేసరికి అయిదుకావస్తోంది. నేనూ, సన్యాసిరావూ "వెడతామంటూ" లేచాము

"కాఫీలు త్రాగి వెడుదురుగాని ఇప్పుడు హొటలుకేం వెడతారు " గోపాలం మాటలు విని మళ్లీ కూర్చుండి పోయాము గోపాలం క్రిందకు వెళ్లి కాఫీ కలపమని రేణుకకు చెప్పి వచ్చాడు

ఓ పావు గంట తర్వాత రేణుక కాఫీ తెచ్చి మాముగ్గురికీ యిచ్చింది

"ఫిల్టర్" కాఫీ కాబోలు.. చాలా బాగుంది గోపాలంగారూ..." అన్నాడు సన్యాసిరావు కాఫీ చాలా బాగుంది, రుచీ పచీ లేని హొటలు కాఫీకి అలవాటు పడ్డ వాళ్లం మరి!

"ఇవాళ రేణూని సినిమాకితీసుకు వెడతానన్నాను ..... మీరూ రాకూడదూ. సరదాగావెడదాం. .."

"నాకేం అభ్యంతరం లేదు... మీరేమంటారు సన్యాసిరావు గారూ?...."

"సరే పదండి . నేనూ సినిమా చూసి చాలా రోజులయింది" అన్నాడు సన్యాసిరావు.

"అయితే ఆరయ్యే సరికల్లా "సంగమ్" టాకీసుకి వచ్చేయండి" అన్నాడు గోపాలం

నేనూ సన్యాసిరావూ బయలు దేరాము. దారిలో సన్యాసిరావు అన్నాడు

ఇవాళ మాబామ్మ గుర్తుకొచ్చిందండీ. "

"ఇవాళ ఆవిడ పోయిన రోజా ?"

"ఛా.... అది కాదండీ హెూమ్లీ మీల్స్ చేసి ఎంత కాలం అయిందో! వంటకాలన్నీ బహురుచిగా ఉన్నాయి మా బామ్మ వంటని గుర్తుకుతెచ్చాయి." అతగాడి వైపు వింతగా చూశాను

"మొదట గోపాలంగారు వంటంతా రేణుకగారే చేశారని చెప్పినప్పుడు- నిజం చెప్పద్దూ- రుచీపచీ ఉండవేమోనని నీళ్లుకారిపోయాను. కానీ ఆశ్చర్యం. ఎంతరుచిగా ఉన్నాయండి కాలేజీలో చదివినఅమ్మాయి వంట అంత రుచిగా చేసిందంటే ఆశ్చర్యం కాదూమరి ఆవిడకు చదువులోనే కాదండీ బాబూ ఫస్టు క్లాసు వంటలోకూడా ఇచ్చెయ్యచ్చు"

"అవును రేణుక వంట చాలా బాగా చేసింది."

నేనూ, సన్యాసిరావు వెళ్ళేసరికి టికెట్లుకొని హాలు దగ్గర మా కోసం గోపాలం, రేణుకా ఎదురు చూస్తున్నారు. సరదాగా మాట్లాడు కుంటూ సినిమా చూశాము సినిమాలో కథానాయిక అష్టకష్టాలూ పడుతుంది సినిమా చూస్తూ మాటి మాటికీ రేణుక రుమాలుతో కళ్ళొద్దుకోవడం గమనించక పోలేదు నడక సాగించేము

"రేణుకగారిది రూపానికి తగ్గట్టు అతి మెత్తని మనసండీ ఆవిడ పాపం కథానాయిక కష్టాలు చూడలేక పోయారు," అన్నాడు సన్యాసిరావు

నేను ఆశ్చర్యపోయాను అతగాడు రేణుకను పరీక్షగా గమనిస్తూనే ఉన్నాడన్నమాట!

* * *

ఆ మరునాడు మామయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది "ఆగస్టు ముప్ఫయ్యో తారీకు ముహూర్తం మీ యిద్దరి నక్షత్రాలకీ చాలా బావుంది నేనూ, మీ అమ్మా పాత కాలం వాళ్ళం. అందువల్ల పెళ్ళికి కావాల్సిన బట్టలూ, వెండిచెంబూ, కంచం, హేమకి కావాల్సిన నగలూ నువ్వూ హేమకలిసి కొనుక్కుంటేనే బావుంటుందని నేనూ, మీ అమ్మ అనుకుంటున్నాం. అంచేత నువ్వోక నాలుగు రోజులు సెలవుపెట్టి రా" అంటూ వ్రాశాడు.

ఈ విషయం ఆ సాయంత్రం గోపాలానికీ, సన్యాసిరావుకీ, చెప్పాను

"మీరు అదృష్టవంతులు ప్రకాశంగారూ! ఈ పెళ్ళి చూపులు వగైరాలు లేకుండా చక్కగా మామయ్య కూతురుంది" అన్నాడు సన్యాసిరావు

"వీడు చాలా అదృష్టవంతుడండి హేమ నాకుచిన్నప్పటినుండీతెలుసు రేణూ, హేమా ప్రాణస్నేహితురాళ్లు ఇంటర్మీడియేటువరకు క్లాసుమేట్సు ఇప్పటికీ ఉత్తరాలువ్రాసుకుంటారు" అన్నాడు గోపాలం

నాలుగు రోజులు సెలవుపెట్టి ఆ మరునాడే రాజమండ్రికి ప్రయాణమయ్యాను మా ఇల్లూ, మామయ్యగారిల్లూ సందడిగా ఉన్నాయి గోడలకు వెల్లలు వేశారు, తలుపులకూ గుమ్మాలకూ రంగులు వేశారు హేమకి నన్ను చూడగానే సిగ్గుముంచుకొచ్చింది నిన్నమొన్నటి వరకూ నాతో గంటల తరబడి మాట్లాడే హేమ, నోరు విప్పితే ముత్యాలు రాలతాయేమో నన్నట్లుచాలా తక్కువగా మాట్లాడుతోంది. నన్ను చూస్తేనే సిగ్గుపడుతోంది ఏమిటీ ఆడపిల్లలు! నిన్నమొన్నటి వరకూ ఈ సిగ్గు ఎక్కడ దాగుంది? పెళ్లంటే సిగ్గు ముంచు కొస్తుంది కాబోలు నేనూ హేమా కలిసి నగలకీ, వెండి సామానుకీ ఆర్డరిచ్చాం బట్టలు కొన్నాము అనుకున్నట్లు పనులు నాలుగురోజుల్లో పూర్తికాలేదు మరో నాలుగు రోజులు సెలవు పొడిగించాల్సి వచ్చింది

రైలు కదుల్తూంటే హేమ కళ్ళనీళ్ళు పెట్టుకుంది

"మన పెళ్ళి ఇరవై రోజుల్లోకి వచ్చేసింది మనకిక ఎడబాటు ఉండదు నేనెక్కడవుంటే నువ్వూ అక్కడే ఉంటావు" అంటూ ఓదార్చేను

* * *

నేను గోపాలం ఇంటికి వెళ్ళేసరికి రేణుకా, సన్యాసిరావూ వరండాలో కూర్చుని ఉన్నారు సన్యాసిరావు ఏదో చెబుతున్నాడు రేణుక ముసిముసి నవ్వులు నవ్వుతోంది నన్ను చూసి,

"రా ప్రకాశం అన్నయ్యా వూరునుండి ఎప్పుడొచ్చావు? హేమ ఎలా వుంది? నాలుగురోజుల్లో వస్తానన్న వాడివి ఇన్ని రోజులు చేశావేమిటి? హేమను వదలి రాలేకపోయావా? ఇక్కడ నీకోసం అన్నయ్యా సన్యాసిరావుగారూ కలవరిం చేస్తున్నారు" అంది రేణుక

నేను నవ్వి, "పొద్దున్న వచ్చాను గోపాలం ఏడీ?" అన్నాను


"స్నానం చేస్తున్నాడు" అంటూ రేణుక లోపలికి వెళ్ళింది

"విశేషాలు చెప్పండి" అన్నాడు సన్యాసిరావు

"విశేషాలు ఏముంటాయి పెళ్లికి కావాల్సినవి కొన్ని కొన్నాం కొన్నిటికి ఆర్డర్లిచ్చాం. ఒక్క నిముషం కూడా తీరికలేక పోయిందనుకోండి"

రేణుక నాకు కాఫీ యిస్తూ,

"మేము ఇప్పుడే తీసుకున్నాం" అంది




ఇంతలో గోపాలం వచ్చాడు

"రారా బాబూ నాలుగు రోజుల్లో వస్తానన్నవాడివి ఏకంగా పది రోజులు చేశావేమిటి? మాకు తోచక వస్తున్నాం సాయంత్రం సినిమాకి పోదాం"

"రేణుకగారూ ... మీరూ రా కూడదూ" అన్నాడు సన్యాసిరావు

రేణుక చిరునవ్వు నవ్వి వూరుకుంది

"అదీ వస్తుందండి దానికి స్నేహితు రాళ్లతో వెళ్లే అలవాటు లేదు నేను వెళ్లినప్పుడే దాన్ని తీసుకు వెడతాను"

ఈ పదిరోజుల్లోనూ రేణుకా, సన్యాసిరావూ చాలా దగ్గరయ్యా రన్పించింది

సినిమా అయ్యాక,

"మా యింటికి రారా ప్రకాశం అన్ని విషయాలూ చెబుదువుగాని" అన్నాడు గోపాలం సన్యాసిరావు వెళ్లిపోయాడు నేను గోపాలం వాళ్ల యింటికి వెళ్లాను. ఆ రాత్రి వాళ్లింట్లోనే భోజనం చేశాను నేనూ హేమా కలిసి కొన్నవీ అర్డర్లిచ్చి నవీ చెప్పాను

నేనూ, గోపాలం లోకాభి రామాయణంలో పడ్డాము

"ఒరేయ్ ప్రకాశం ఒక సంగతి చెప్పు ఒక పెళ్ళికాని అబ్బాయి ఒక పెళ్లి కాని అమ్మాయిని చూడ్డానికి రోజూ వస్తున్నాడు పూసుకుని మాట్లాడు తున్నాడు. అంతే కాదు ఆమె వంటని తెగమెచ్చుకుంటు న్నాడు దాని అర్థ మేమిటి?"

"ఆ పిల్ల చేత అతగాడు ఆకర్షింప బడ్డాడనీ, ప్రేమిస్తున్నాడనీ అనుకో వచ్చు ఇంతకీ ఎవరి విషయం అడుగుతున్నట్లు?"

"ఇంకెవరి విషయమో అయితే మనకెందుకు? మన సన్యాసిరావ్!

నువ్వు పదిరోజులులేవా మా ఇంటికి అతడు రానిరోజంటూలేదు పిలవగానే రెండుసార్లు భోజనానికి వచ్చాడు రేణూతో సరదాగా మాట్లాడుతున్నాడు దాని వంటని తెగమెచ్చుకుంటున్నాడు నా అనుమానం రేణూని ప్రేమిస్తున్నాడేమోనని "

"నాకూ అదే అనుమానం వచ్చింది ఇవాళ సాయంత్రం అతడిని చూడగానే "

"నువ్వు రంగంలోకి దిగాలి ఇవాళో రేపో అతగాడు నీదగ్గర రేణూ ప్రసక్తి తీసుకొస్తాడు ప్రేమిస్తున్నట్లు చెప్పచ్చుకూడా ఎంత ప్రేమించినా కట్నం దారి కట్నానిదే కావచ్చు అతగాడి ఆస్థిపాస్తులు, ఉద్యోగమూ చూస్తే ఈ రోజుల్లో ఎంతలేదన్నా పది పదిహేను వేల కట్నంఇవ్వాల్సి వుంటుంది నీకు మా స్తోమత తెలియంది కాదు కట్నం ఇచ్చే పరిస్థితిలో లేను అయితే కిందా మీద పడి నీ బోటి స్నేహితుల సహాయంతో పెళ్లి మాత్రం ఘనంగానే చేస్తాను "

కొద్ది క్షణాలు ఆలోచించాను

"అతడే వచ్చి అడిగితే, మనమే పై మెట్టు మీద వున్నట్టు లెక్క రేణుకను దూరపు బంధువుల అబ్బాయి చేసుకుంటానంటున్నాడనీ అతడు ఇంజనీరనీ, అతడికి రేణూ అంటే చాలా ఇష్టమనీ, కట్నం అక్కర్లేదన్నారనీ చెబుతాను... "

"నీ అయిడియా బ్రహ్మాండంగా వుంది నువ్వింక రంగంలోకి దిగు "

అన్నాడు గోపాలం ఉత్సాహంతో

* * *

ఒకరోజు రాత్రి భోజనాలయ్యాక, మీతో మాట్లాడాలంటూ నా గదికి వచ్చాడు సన్యాసిరావు కాసేపు అ మాటా ఈ మాటా మాట్లాడి, గోపాలం వాళ్ళ గురించి అడిగాడు

"గోపాలం వాళ్ళది ఉన్నత వంశం సాంప్రదాయమైనకుటుంబం గోపాలంతండ్రి వెంకట్రామయ్యగారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళారు ఆస్తి అంతా ఉద్యమంలో తిరగడానికే హరించుకుంది ఆయన ఎన్నడూ పదవుల కోసం ప్రాకులాడ లేదు ఇక గోపాలం నాకు చిన్నప్పటి నుండీ తెలుసు మేమిద్దరం ప్రాణ స్నేహితులం "

సన్యాసిరావు కొద్ది క్షణాలు మాట్లాడలేదు చివరకు కాస్త సిగ్గు పడుతూ రేణుక గారిపై మీ అభిప్రాయం? " అన్నాడు

"రేణూకేమండీ. మీరుచూస్తూనే వున్నారు కద చదువుకున్న అమ్మాయికి వినయ విధేయతలుండడం అరుదేమో ఆమెది సుతి మెత్తని మనసు రేణూని ఎవరు చేసుకుంటారో కాని, అదృష్ట వంతుడని చెప్పక తప్పదు "

"ఆ అదృష్ట వంతుణ్ని నేనే ఎందుకు కాకూడదు? ఆవిడ రూపమూ, మంచితనమూ నాహృదయంలో హత్తుకు పోయాయి ఇక

ఆవిడ వంట! ఏమాట కామాటే ఆవిడ వంట రుచి చూచినప్పటి నుండి ఈ హెూటలు మెతుకులు మింగుడు పడ్డం లేదండీ బాగా వండి పెట్టే భార్య దొరకడం ఎంత అదృష్టం మీారీ వూనుకుని నన్నూ, రేణుకను ఓ యింటి వాళ్లను చెయ్యాలి ,"

"మీారు చెప్పింది బాగానేవుంది మీారిద్దరూ దంపతులయితే చాలా బావుంటుంది కానీ ఓ చిక్కొచ్చి పడింది "

"ఏమిటా చిక్కు?"

"రేణూకి దూర్వపు సంబంధం ఒక టుంది అతడు ఇంజనీరు....రేణూ అంటే చాలా ఇష్టమట "

"రేణుకగారంటే నాకు మాత్రం ఇష్టం కాదూ? నాకు మాత్రం లో టేముంది? పోనీ మాసాంప్రదాయం లో లోటుందా? అతగాడు ఇంజనీరే కావచ్చు ప్రస్తుతానికి నేను గుమా స్తానే కావచ్చు ఒకటిరెండు నెలల్లో నేను మాత్రం ఆఫీసరుని కానూ?

"అవుననుకోండి ..." మాటలు నాన్చేశాను.

"ఏమిటండీ" అన్నాడుఆతృతతో

"ఆ ఇంజనీరుకి మరి కట్నం అక్కర్లేదట "

"కట్నం నాకు మాత్రం కావాలా? కట్నంకోసం ఎగబడే వాడి నయితే పాతికవేలవరకూ ఇస్తామంటూ వచ్చారు . ఎంచేత అవుననలేదు? . నాకు కావాల్సింది కట్నం కాదు.... నాకు నచ్చిన అమ్మాయి నా అభి రుచులకు తగినట్లున్న అమ్మాయి..రేణుకగారి రూపము, మంచితనము నాహృదయంలో హత్తుకుపోయాయి. సద్గుణవతీ, బాగా వండిపెట్టే భార్య దొరకడం ఎంత అదృష్టం రేణుక గారిని చేసుకునేవాడు అదృష్టవంతు డని మీారే అన్నారు నేనూ అదే అంటున్నాను ఆ అదృష్టవంతుడు నేనేకావాలి ప్రకాశంగారూ ఇది మీా వల్లే అవుతుంది ఎలాగైనా మీారు రంగంలోకి దిగి, మమ్మలిద్దర్నీ కల పాలి " అంటూ ప్రాధేయ పడ్డాడు సన్యాసిరావు

"చూడండి సన్యాసిరావు గారూ . మీాకయితే కట్నం అక్కర్లేకపోవచ్చు కానీ మీాతల్లిదండ్రులకు మీారొక్కరే మగ సంతానం మీా విషయంలో వారికి కొన్ని ఆశలు వుండవచ్చు. మీా పెళ్లి ఘనంగాజరగాలనీ, కట్నం కానుకలు బాగారావాలనీ కోరవచ్చు అంతేకాక వాళ్లకు రేణూ నచ్చాలి. నేను వూనుకుని గోపాలాన్ని ఒప్పి స్తాననే అనుకుందాం గోపాలం పరి స్థితి మీాకు తెలియందికాదు. కట్న కానుకలు ఇవ్వలేడు పెళ్ళి బాగానే చేస్తాడనుకోండి ఇవన్నీ ఆలో చించారా?

"మా వాళ్ల విషయంలో హామీా ఇస్తున్నాను వాళ్లు నా మాటకు ఎదురుచెప్పరు ఇక గోపాలం గారి విషయం మీారు చెప్పినవన్నీ నాకు తెలుసు "

"సరే అలాగయితే నేను గోపాలం దగ్గర ఈవిషయం కదుపుతాను.

మీరు మీ నాన్నగారికి ఉత్తరం వ్రాయండి. దైవ నిర్ణయం యెలా వుందో ”

“వ్రాస్తానండి నాన్నగారిని ఓసారి రమ్మని వ్రాస్తాను ”

ఆ తర్వాత గోపాలంతో జరిగింది చెప్పాను చాలా సంతోషించాడు

* * *

కొద్దిరోజులు గడిచిపోయాయి

ఆరోజు ఆదివారం ఉదయం పది గంటలవేళ సన్యాసిరావు తండ్రిని వెంటబెట్టుకుని నా గదికి వచ్చాడు

“ఒరేయ్ అబ్బాయ్...నువ్వో అర గంటపోయాకరా...నేను ఈయనతో అన్ని విషయాలూ మాట్లాడతాను” అన్నారాయన

“సరే...” అంటూ వెళ్ళిపోయాడు సన్యాసిరావు అతడు వెళ్ళాక-

“చూడుబాబూ...మావాడు యెవ రినో ప్రేమించాననీ, ఆ పిల్లనితప్ప పెళ్ళాడననీ వ్రాశాడు... పరిగెత్తుకుం టూ వచ్చాను...వాళ్ళు నీకు బాగా తెలుసట...వాళ్ళు మనవాళ్ళేనా? ఆ పిల్ల ఎలా వుంటుంది? చదువు కున్న దా?...అన్ని విషయాలూ చెప్పు బాబూ” అన్నారాయన

వెంకట్రామయ్యగారి గురించి చెప్పాను గోపాలంగురించిచెప్పాను ఆ తర్వాత రేణుకను గురించి చెప్పాను.

“వాళ్ల ఇంటిపేరు?...”

చెప్పాను

“ ఇంతసేపూ చెప్పావు కాదేం బాబూ...వెంకట్రామయ్యగారి పేరు వినడమేకాదు, ఆయనా నేనూ రాజ మండ్రి కాలేజీలో బి ఏ, చదువు కున్నాంకలసి ఆయనబావున్నారా?”

“ఆయన పోయి నాలుగేళ్ళు దాటింది ఆ కుటుంబాన్ని నడిపేది గోపాలం “ఇన్సూరెన్సు”కంపెనీలో పనిచేస్తున్నాడు తమ్ముడుఇంటర్మీడి యేట్ చదువుతున్నాడు... గోపాలం కట్నం ఇవ్వలేడు పెళ్లి మాత్రం ఘనంగానే చేస్తాడు ”

“కట్నం ఆశ మాకులేదు...పాపం గోపాలం ఇంకా కుర్రాడు...అతడిని కట్నం అడిగితే పాపం కూడానూ కానీ ఒక్క విషయం ఏమా వాడు ప్రేమించాడుబాగానేవుంది ఎంతైనా మగపెళ్ళివారం కద పిల్ల నివ్వం డంటూ అడగడంఅదోలావుంటుంది గోపాలం నామమాత్రంగావచ్చి, మా వాడికి చెల్లెల్ని చేసుకోమని అడిగితే తృప్తిగా వుంటుంది ”

“ఎంత మాట...నే నిప్పుడే వెళ్ళి గోపాలానికిచెబుతాను...సాయంత్రం వచ్చి మిమ్మల్ని గోపాలం ఇంటికి తీసుకువెడతాం మీరు రేణుకను చూసినట్లూ వుంటుంది

ఆయన తేలిగ్గా నిట్టూర్చారు ఇంతలో సన్యాసిరావు వచ్చాడు.

వాళ్లిద్దరూ అలా వెళ్లగానే, నేను గోపాలం ఇంటికి పరిగెత్తాను గోపాలం అమితమైన సంతోషంతో,

“ఆలశ్యమెందుకు?.ఇద్దరంకలసి ఇప్పుడే వెళ్లి ఆయనకు చెబుదాం ” అన్నాడు

“ఇంతకీ సన్యాసిరావంటే రేణూకి

ఇష్టమేనా?" సందేహ నివృత్తికోసం అడిగాను,

"దానికి ఇష్టం కాబట్టే...."

రేణుకవైపు చూశాను సిగ్గుతో ముఖం ఎర్రనయింది కాఫీ తెస్తానంటూ లోపలికివెళ్లింది,

ఓగంటతర్వాత నేనూ, గోపాలం కలసి సన్యాసిరావు గదికివెళ్లాము గోపాలాన్ని జగన్నాధంగారికి పరిచయం చేశాను కాసేపు కబుర్లయ్యాక రేణుకను సన్యాసిరావుకి చేసుకోమని అడిగి, సాయంత్రం రేణుకను చూడ్డానికి రమ్మని పిలిచాడు ఆయన సంతోషించారు

సాయంత్రం నాలుగుగంటలకు నేనూ గోపాలం వెళ్లి జగన్నాధం గారినీ, సన్యాసిరావునీ వెంట బెట్టుకుని వెళ్ళాము మేమువరండాలో కుర్చీల్లో కూర్చున్నాక రేణుక కాఫీ టిఫిన్లు తెచ్చియిచ్చింది రేణుకను జగన్నాధం గారికి పరిచయం చేసాడు గోపాలం రేణుక చేతులు జోడించి ఆయనకు నమస్కారించింది

"కూర్చోమ్మా," అన్నారాయన

రేణుక పొందిగ్గా కుర్చీలో కూర్చుంది

మేముటిఫిన్లు అరగించసాగాము బంగాళాదుంప బోండా, మైసూరుపాకూ చాలా రుచిగా ఉన్నాయి రేణుకను చూసి జగన్నాధంగారు తృప్తిగా నిట్టూర్చారు ఆమెవినయవిధేయతలు ఆయన్ని అమితంగా ఆకర్షించాయి,

మేముకాఫీలు త్రాగడమయింది గోపాలం లోపలికి వెళ్లితల్లికి చెప్పాడు ఆవిడ గుమ్మందగ్గరకు వచ్చినిలబడింది జగన్నాధంగారు అన్నారు "చూడమ్మా నేనూ వెంకట్రామయ్యా కలసి చదువుకున్నాము ఈవిధంగా మళ్లీ కలిశాం పాపం అతడుంటే ఎంతగా సంతోషించేవాడో "

పార్వతమ్మగారు కళ్లు వత్తుకుంది ఆతర్వాత

"మాకుటుంబ పరిస్థితులు మీకు పూర్తిగా తెలుసుగా అన్నయ్యగారూ మేము కట్నాలు ఇచ్చుకునే స్థితిలో లేము," అన్నది

"అన్నీ తెలుసమ్మా. కట్నాల ఆశ మాకు లేదు గోపాలంకురాడు అతడిని కట్నం ఇవ్వమని అడగడం కూడా పాపమే మీ అమ్మాయి మాకునచ్చింది మీరు మాకు లక్ష్మిని ఇస్తామంటుంటే వేరేకట్నం ఎందుకమ్మా "

పార్వతమ్మగారు తృప్తిగా నిట్టూర్చి,

"ఆయన అంటూండేవారు రేణూని గురించి నాకు బెంగలేదు దానికి మంచి సంబంధం వస్తుంది అని ఆయనమాట ఈనాడు నిజమైంది ఆయనేవుంటే ఎంతగా సంతోషించేవారో మరో మాట అన్నయ్యగారూ మాకు ఒక నెల వ్యవధి కావాలి ఇంటికి పెద్ద అకుర్రకుంక ముహూర్తం మరీ దగ్గరయితే నెగ్గుకురాలేడేమో?" అంది

"మాకు మాత్రం వ్యవధి కావద్దు టమ్మా మాకున్న మగ నలుసల్లా వాడేకద వీడి పైన ఇద్దరాడపిల్లలు పెద్దదికలకత్తాలోవుంటోంది రెండోది బొంబాయిలో వుంటోంది తమ్ముడి పెళ్ళంటూ చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు వాళ్ళకి "టైము" ఇవ్వాలి కద అల్లుళ్లకి సెలవు దొరకాలి కద ఇది ఆగస్టా సెప్టెంబరులో ఎలాగూ ముహూర్తాలు లేవు అక్టోబరులో లగ్నం పెట్టుకుందాం నేనూ మా ఆవిడా మంచి రోజు చూసుకుని తాంబూలాలు పుచ్చుకోడానికి వస్తాం. మరి వెళ్లిరామా అమ్మా "

"మంచిదన్నయ్యగారూ "

"అమ్మాయి రేణుకా,వస్తామమ్మా"

రేణుక చేతులు జోడించింది

నేను జగన్నాధంగారిని, సన్యాసిరావునీ అనుసరించేను దారిలో జగన్నాధంగారు అన్నారు

"మావాడు ప్రేమలో పడ్డాడని తెలియగానే ఎలాంటి పిల్లోనని భయపడ్డాను మంచి పిల్లనే ఎన్నుకున్నాడు. చిదిమి దీపం పెట్టుకోవచ్చు ఆ వినయమూ, విధేయత ఎంతయినా వెంకట్రామయ్యా కూతురయ్యా "

* * *

ఆ రోజు రేణుక పుట్టినరోజు. నన్నూ, సన్యాసిరావునీ భోజనానికి పిలిచేడు గోపాలం సన్యాసిరావు నూటపాతిక పెట్టి రేణుక కోసం చీరకొన్నాడు

సుష్టుగా భోజనాలు చేశాము ఆ తర్వాత చీర ప్యాకెట్టు రేణుకకి ఇచ్చాడు సన్యాసిరావు రేణుక చీరను చూసి,

"మీకు చీరల సెలక్షన్ బాగా తెలుసు, చీర బాగుంది " అంది రేణుక,

"నీ వంట కంటేనా? " అన్నాడు సన్యాసిరావు

"మీ పొగడ్తలు ఇక ఆపండి " చిరు కోపాన్ని అభినయించింది రేణుక! మేము ముగ్గురమూ నవ్వుకున్నాము

"నా పుట్టిన రోజుకి నువ్వేం తెచ్చావు ప్రకాశం అన్నయ్యా."

"చూడు రేణూ నేనూ గోపాలం కలసి నీకు అమూల్యమైన బహుమతినిస్తున్నాం "

"ఏమిటమ్మా అది? "

"సన్యాసిరావుగారి లాంటి ఉత్తముడ్ని నీకు భర్తగా ఇస్తున్నాం అంతకంటే విలువైన బహుమతి ఏముంటుంది రేణూ? "

రేణుక సిగ్గుపడిపోయి ముఖం దించుకుంది

ఆ మరునాడే నా ప్రయాణం ఆ సంగతి సన్యాసిరావుకీ, గోపాలానికీ రేణూకి, పార్వతమ్మగారికీ, చెప్పి పెళ్లికి తప్పకుండా రమ్మనిఆహ్వానించాను

"నాకు సెలవు దొరికితే తప్పకుండా వస్తానండీ " అన్నాడు సన్యాసిరావు

"రేణుకనూ, గోపాలాన్ని పంపు తానయ్యా ప్రకాశం నేను మాత్రం రాలేను మరేమీ అనుకోకు నా ఆరోగ్యం సంగతి తెలుసు కద " అంది పార్వతమ్మగారు

"మీరు కాపురం పెట్టగానే నన్ను భోజనానికి పిలవాలండోయ్ మీ యింట్లో "హెూమ్మీల్స్" తినాలి." అన్నాడు సన్యాసిరావు

"అదెంత భాగ్యం " అంటూ నవ్వేను

కాసేపు కూర్చుని, పని వుందంటూ వెళ్ళిపోయాడు సన్యాసిరావు నేనూ, రేణుకా, గోపాలం కబుర్లలో పడ్డాము చాలా రోజులుగా నా మనసులో వున్న సందేహాన్ని బయట పెట్టాను

"అవును కానీ రేణూ నీ వంటని సన్యాసిరావు ఎంతగానో మెచ్చుకుంటాడు నిజానికి వంట చాలా బాగా చేస్తున్నావ్. నీకు వంట అంత బాగా రాదని తెలుసు, అలాంటిది ఇంతబాగా వంట చెయ్యడంఎప్పుడు నేర్చుకున్నావ్? "

రేణుక సమాధానం చెప్పలేదు. ముసిముసి నవ్వులు నవ్వింది గోపాలం సిగరెట్టు దమ్ములాగి పొగ వదిలి, అన్నాడు

"ఒకరోజు ఏమన్నానోగుర్తుందారా ప్రకాశం సన్యాసిరావు చేత ఇరవై వేలకి, ఇన్సూరు చేయిస్తాను కాకపోతే రేణుక మెడలో మూడు ముళ్ళూ వేయిస్తానని సన్యాసిరావు చేత ఇన్సూరు చేయించడం విషయంలో ఓడిపోయాను అతడి చేత ఇన్సూరు చేయించడం నాకేకాదు,, మా జనరల్ మేనేజరుకూ్కడా సాధ్యం కాదేమో? అయితే సన్యాసి రావు నాకు నచ్చాడు, అలాంటివాడి చేతిలో రేణూని పెట్టగలిగితే నాకే బెంగావుండదు కాని పెళ్ళికొడుకుల మార్కెట్‌లో అతనిని కొనగలశక్తి నాకులేదు, మనిషి అన్నాక ఏదో ఒక బలహీనత వుండడం సహజం సన్యాసిరావులో బలహీనతను పూర్తంగా తీసుకున్నాను, అతనికి రుచి కరమైన భోజనంకావాలి నాలుగైదు సార్లు అతనిని భోజనానికిపిలిచాను. వంటంతా రేణూయే చేసిందని చెప్పాను రేణూ వంటని మెచ్చుకొంటూ ప్రేమలోపడ్డాడు అతర్వాత కథా, కమామీషూ నీకు తెలిసిందే. నీకుతెలియని విషయమల్లా . "

"ఏమిటది ?"

"సన్యాసిరావుని భోజనానికి పిలిచినప్పుడల్లా, వంటసుబ్బమ్మ చేత వంట చేయించాననీ ప్రతిసారిసుబ్బమ్మకి వంటచేసినందుకు గాను మూడేసిరూపాయలిచ్చానని "

నేను విస్తుబోయి,తేరుకునేలోపున గోపాలం తిరిగి అన్నాడు

"ఈరహస్యాన్ని నీలోనేవుంచుకో వంటన్నది బ్రహ్మవిద్యేమీ - కాదు ఆడపిల్ల నేర్చుకుంటేవంట ఎంతలో వస్తుంది చెప్పు రేణూ ఇప్పుడిప్పుడే వంట చెయ్యడం నేర్చుకుంటోంది"